క్లుప్తంగా

గూడూరు వాసికి డాక్టరేట్


మునుగాల శ్రీనివాసులు

కర్నూలు సిటీ: గూడూరు మండల కేంద్రానికి చెందిన మునుగాల శ్రీనివాసులకు ఎస్కే యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రొఫెసర్ రవీందర్ పర్యవేక్షణలో 'రాయలసీమ విశ్వవిద్యాలయాల ఎంటెక్ విద్యార్థులు ఉన్నత విద్యలో సమాచారాన్ని స్వీకరించే నిమిత్తం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని అధిగమించి పోటీ ప్రపంచంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఆకలింపు చేసుకోవడం, సాంకేతిక విద్యలో గ్రంథాలయాలు, ఎలక్ట్రానిక్ వనరుల ప్రాముఖ్యత'పై చేసిన పరిశోధనలకు గానూ తనకు ఎస్కే యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చిందని శ్రీనివాసులు తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.143 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

సారా బట్టీ ధ్వంసం

కోడుమూరు రూరల్: నాటుసారా బట్టీని పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. కృష్ణగిరి మండలం కర్లకుంట నుంచి అమకతాడు వెళ్లే రోడ్డులోని వాగులో బోయ బాలమద్దిలేటి, బోయ శివకృష్ణ గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీని గుర్తించి ధ్వంసం చేశారు. 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. సోదాల్లో సీఐతో పాటు సెబ్ సిబ్బంది హనుమంతు, వెంకటేష్ నాయక్, అప్రోజ్‌బాషా, విరుపాక్షిరెడ్డి, మహిళా పోలీస్ రాములమ్మ పాల్గొన్నారు.

అశోకా అవార్డుల ప్రదానోత్సవం



అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న అతిథులు

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో 'సాచి-అద్భుతమైన ఓ మహిళ' అవార్డు కార్యక్రమం నిర్వహించారు. గురువారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాంటిస్సోరి విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ గాయనీ రాజశేఖర్, డైరెక్టర్ (ఫారిన్ అఫైర్స్, అలూమిని)జెఎన్‌టీయూ పి. సుజాత, ఉస్మానియా కళాశాల కరస్పాండెంట్ అజ్రాజావేద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అశోక్ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వివిధ హోదాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలకు గుర్తింపుగా సాచీ అవార్డుతో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఈఓ హరీస్ కృష్ణా, ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


10న పరుగు పందెం పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో నాగలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 10న పరుగు పందెం, స్లో బైక్ రైడింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సలాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు నీలకంఠుడి రథోత్సవం

గూడూరు: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, రాత్రి శివ పార్వతుల కల్యాణం ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

బేటీ బచావో - బేటీ పడావోపై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు గ్రామంలోని ముఖ్యమైన కూడళ్లలో గురువారం ఐసీడీఎస్ ఏపీడీఓ పద్మావతి ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ మహిళా సాధికారిత సాధనకు సమాజంలో మార్పు రావాల్సి ఉందన్నారు. ఆత్మస్థైర్యంతో బాలికలు ముందడుగు వేసేలా ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. సమాజాన్ని ప్రభావితం చేయగల నేటి పిల్లలే బావి తరాలకు భవిష్యత్ నిర్దేశకులన్నారు. యుక్త వయసులో పిల్లల ఆలోచనలు విద్యపై, నిర్ణయించుకున్న భవిష్యత్ కార్యాచరణపై మాత్రమే ఉండాలి తప్ప ఇతర ఆలోచనల వైపు పెట్టరాదన్నారు. ప్రతి ఒక్కరికి ఒక ఆశయాన్ని ఎంచుకుని చదివితే భవిష్యత్‌లో మంచిస్థాయిలో ఉంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం దస్తగిరమ్మ, సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


నన్నూరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నన్నూరు బంగ్లా బస్టాండ్ ప్రాంతంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన పుట్ ఓవర్ వంతెన, బండ వాగుపై రూ.3 కోట్లతో నిర్మించిన వంతెన, రూ.61 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎస్సీ కాలనీలలో నిర్మించిన సీసీ రోడ్లు, గడ్డ వాగు నుంచి తడకనపల్లె రోడ్డు వరకు నిర్మించిన బీటీ రోడ్లు, నాగేశ్వరస్వామి గుడికి నిర్మించిన కాంపౌండ్ వాల్, రాగ మయూరీలో నూతన పార్కుకు నిర్మించిన కాంపౌండును ప్రారంభించారు. ఉప్పలపాడులో రూ.70 లక్షలతో ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో పలు చోట్ల నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నన్నూరు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పురాతన వంతెనను పునరుద్ధరించామన్నారు. విద్యార్థుల భద్రత కోసం హైవే అధికారులతో మాట్లాడి జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ వంతెనను నిర్మించామన్నారు. నాలుగున్నరేళ్లలో నన్నూరు గ్రామానికి రూ.70 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రెండు విడతల్లో కలిపి సుమారు 1,400 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. నన్నూరు నుంచి రామళ్లకోట వరకు బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. నన్నూరు నుంచి చిన్నటేకూరు వరకు రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడతామన్నారు. అభివృద్ధి పనులను చూసి మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ మద్దన్న, డీఈ మనోహర్, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఆయా గ్రామాల సర్పంచులు బ్రహ్మయ్య, అయ్యస్వామి, ఎంపీటీసీ సభ్యులు పాతిమాబి, కుసుమలత, పుల్లయ్య, మాజీ సర్పంచు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, షరీఫ్‌మియా, ఆంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షులు దారం రఘురామిరెడ్డి, గఫార్‌మియా, సత్యరాజు, ప్రతాప్ రెడ్డి, దస్తగిరి, మధు, వెంకటేశ్వరరెడ్డి, శివశంకరప్ప పాల్గొన్నారు.


ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

ప్రజల చెంతకే పాలన

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తూ ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం సల్కాపురం గ్రామంలో సచివాలయం, రైతు భరోసాకేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండదనే ఉద్దేశంతో ప్రభుత్వ భవనాలను గ్రామాల్లోనే ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులకు కావాలసిన ఎరువులు, మందులు, విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆర్ఓఆర్, అడంగల్, 1-బి సేవలు గ్రామాలకు తీసుకువచ్చామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, ఎంపీపీ బోయ శారద, కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, హనుమంతురెడ్డి, సత్యంరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ


పట్టాలు అందుకున్న వారితో సతీష్, హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు (సిటీ): స్థానిక 39, 40 వార్డులకు చెందిన 300 మంది పేదలకు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి గురువారం ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌రావు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, నాయకులు కిరణ్, సయ్యద్ ఇషాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కర్నూలు (టౌన్): స్థానిక జొహరాపురం జమ్మిచెట్టు వద్ద 35 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన కొత్త సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు గురువారం సాయంత్రం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్థలాన్ని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ ఈఈ షాకీర్ హుస్సేన్, ఏఈలు నాగశేఖర్ పాల్గొన్నారు.

చేయూతతో అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భద్రత

● కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి


మెగా చెక్కును అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

సి.బెళగల్: చేయూతతో అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భద్రత చేకూరుతోందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు నాల్గవ విడత చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా మహిళలకే చేరుతుండటం సంతోషకరమన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. కోడమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి 125 సార్లు బటన్ నొక్కారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకునేందుకు వచ్చే ఎన్నికల్లో రెండు బటన్లు ఫ్యాన్ గుర్తుపై నొక్కాలన్నారు. ఎంపీడీఓ శకుంతల మాట్లాడుతూ మండలంలో 3,551 మంది మహిళలకు రూ.6.66 కోట్లను మంజూరు చేసిందన్నారు. అనంతరం మహిళలు, అధికారులతో కలిసి నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, ఎంపీపీ బొంతల మునెప్ప, సర్పంచ్ పాండురంగన్న, కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి వెంకటేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న కొండన్న, మండల కార్యదర్శులు మహానంది, బాయికటి మద్దిలేటి, గోపాల్, రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు ముల్ల హారున్, కర్నూలు జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నబాబు పాల్గొన్నారు.


పైపులైను పనులను ప్రారంభిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. గురువారం సంగాల గ్రామంలో కుడా నిధులు రూ.11 లక్షలతో ఏర్పాటు చేయనున్న పైపులైను పనులను సర్పంచ్ హనుమంతు, మండల నాయకులతో కలిసి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప పాల్గొన్నారు.

జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం


సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గడివేముల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గడిగరేవుల, దుర్వేశి, కొరటమద్ది గ్రామాల్లో మేము సిద్ధం- మా బూత్ సిద్ధం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం సంక్షేమం, అభివృద్ధి బాగా జరిగి ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయన్నారు. మీ కుటుంబంలో మంచి జరిగితేనే ఓటేయండి అనే ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు హామీలను ప్రజల నమ్మడం లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుని మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రామ్మోహన్‌రెడ్డి, మండ్ల మమత, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాలయ్య, ప్రసాద్, రమేష్, గృహసారథులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం


విద్యుత్ దీపాలతో భోగేశ్వరాలయం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో దక్షిణకాశీగా పేరుగాంచిన దుర్గాభోగేశ్వరాలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. భోగేశ్వరుడి, శ్రీదుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలు, టెంకాయ మట్టలతో అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్లూరు: మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. పందిపాడు గ్రామం పూల శివన్న తోటలో వెలసిన శివాలయంలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు శివపార్వతుల కల్యాణం

కోడుమూరు రూరల్: కోడుమూరులో పునర్ నిర్మిస్తున్న లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శివపార్వతులు, శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవెంకటేశ్వరస్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి తెలిపారు.

10వ తేదీ వరకు వేడుకలు

పాణ్యం: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు పాణికేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈఓ సువర్ణ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 8న స్వామి వారి కల్యాణం, 9న స్వామి వారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 10న మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఉంటుదన్నారు. అదే రోజు సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా ఆశ దినోత్సవం


పోస్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

గూడూరు: పట్టణంలోని పీహెచ్‌సీలో గురువారం ఘనంగా ఆశా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష్న అధ్యక్షతన జరగగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణకుమార్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆశా కార్యకర్తల సేవలను కొనియాడారు. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం ఆశా కార్యకర్తలు కష్టపడుతున్నారన్నారు. జాతీయ కార్యక్రమాలలో కూడా వారి పాత్ర ఉంటుందన్నారు. ఎండా కాలంలో వడ దెబ్బకు గురికాకుండా క్షేత్ర స్థాయిలో ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా యాప్స్, ఆన్‌లైన్ సేవల గురించి ఆయన వివరించారు. డాక్టర్ షఫియా, లీగల్ అడ్వైజర్ న్యాయవాది సుమలత, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండలలో వెలసిన దుర్గా భోగేశ్వరుని మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉత్సవమూర్తులకు వరప్రయాణము నిర్వహించారు. స్వామి వారికి గడిగరేవుల గ్రామంలో వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను భోగేశ్వరాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ తెలిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న ఏపీఎం పుష్పావతి


సి.బెళగల్‌లో ఎంపీడీఓ శకుంతలను సన్మానిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మహిళా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక కోటవీధిలో నిర్వహించిన వేడుకల్లో ఏపీఎం పుష్పావతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మండల మహిళా సమఖ్య ఆధ్వర్యంలో, అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళాదినోత్స వేడుకలను వైకేపీ ఏపీఎం వెంకటస్వామి నిర్వహించారు. ఎంపీడీఓ శకుంతలను, ఎంఈఓ జ్యోతి, ఇతర మహిళా ఉద్యోగులను, పొదుపు మహిళలను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, ఈఓఆర్డీ సందీప్, ఏపీఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

➡ కల్లూరు: మహిళల దినోత్సవ వేడుకలను మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్లూరు ఎంపీపీ బోయ శారద, ఏపీఎంలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

➡ చిన్నటేకూరు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌లో మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ ఉద్యోగులు, ఆయా గ్రామాల పొదుపు సంఘాల మహిళలు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం ఫార్మసీ, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలల్లో గురువారం మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళా కోఆర్డినేటర్లను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మహిళా సాధికారత చైర్‌పర్సన్ డాక్టర్ సోఫియా ప్రియదర్శిని, డైరెక్టర్ డీవీ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డీన్ డాక్టర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.